క్లుప్తంగా

మంచి నీటి బోర్లకు మరమ్మతులు



మంచినీటి బోరుకు మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్

చోడవరం రూరల్: మండలంలోని బెన్నవోలులో ప్రజల దాహార్తి తీర్చడానికి రిపేర్లకు గురైన మంచినీటి బోరు బావులకు మరమ్మతులు చేపట్టారు. పంచాయతీలోని రెండవ వార్డులో మంచినీటి బోరుబావులు రిపేర్లకు గురైన సంగతి సర్పంచ్ మూడెడ్ల శంకరరావు, వార్డు మెంబర్ మొల్లి గోవింద్ గమనించి సచివాలయ కన్వీనర్ జంపా నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారుల ఆదేశాలతో సిబ్బంది పాడైన మంచినీటి బోర్లకు మరమ్మతులు చేసి మంచినీరు వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ముమ్మరంగా వరి కోతలు

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీన పడటంతో రైతులు ముమ్మరంగా వరి కోతలు నిర్వహిస్తున్నారు. తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తాయని కోతలు వాయిదా వేస్తూ వచ్చారు. శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో వరి కోతలకు సిద్ధమయ్యారు. రైతులంతా ఒకేసారి వరి కోతలు ప్రారంభించడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది.

రఘువర్మ సుడిగాలి పర్యటన



ఉపాధ్యాయులను కలిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ

రోలుగుంట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ శుక్రవారం మండల ఏపీటీఎఫ్ సంఘ నాయకులతో కలిసి మండలంలో గల పలు పాఠశాలలు, సీనియర్ కళాశాలలో సుడిగాలి పర్యటన చేశారు. తనకు మరొక అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పి.రమణ, ప్రధాన కార్యదర్శి బోనెల రాము, ప్రధాన సలహాదారులు బండారు రాఘవ నాయుడు, పి.అశోక్ సామ్రాట్, ఉమామహేశ్వర్రావు, బి.నాగేశ్వర్రావు, శారద ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యంతో సంపూర్ణ ఆరోగ్యం



ఎ. కొత్తపల్లిలో చెత్త ఊడుస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ సత్య వెంకటరమణ

దేవరాపల్లి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనుల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ సత్య వెంకటరమణ చీపుర్లు చేతపట్టి చెత్తా చెదారాలు తొలగించారు. సచివాలయ కార్యదర్శి విజయభాస్కర్, సిబ్బంది, పంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నేడు నీటి సంఘం ఎన్నికలు

మాడుగుల: మండలంలో శనివారం 22 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని తహశీల్దార్ కె. రమాదేవి తెలిపారు. 8 మీడియం సంఘాలు, 14 మైనర్ సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. సుమారు 16 వేల మంది రైతులు ఎన్నికల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 22 నీటి సంఘాలకు 22 మంది ఎలక్షన్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

28 మద్యం సీసాల స్వాధీనం

చోడవరం రూరల్: చోడవరం పట్టణ పరిధిలో జరిపిన దాడిలో అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న వ్యక్తి పట్టుబడినట్లు ఎస్ఐ శేఖరం తెలిపారు. అతని వద్ద అక్రమ విక్రయాల కోసం సిద్ధంగా ఉంచిన 28 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.





ధారమఠం.. ప్రకృతి పరవశం

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం ఒకేచోట

పెద్ద ఎత్తున తరలి వస్తున్న భక్తులు.. పర్యాటకులు

కనువిందు చేసే దట్టమైన అడవులు.. సెలయేళ్లు

గొలుగొండ: ప్రముఖ శైవ క్షేత్రమైన ధారమఠం శివాలయం ప్రకృతి సోయగాల నడుమ భక్తులు, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. కార్తీకమాసం, మహాశివరాత్రి వంటి పర్వదినాల్లోనే కాకుండా సాధారణ రోజుల్లో కూడా రద్దీగా ఉంటుంది. దీనికి కారణం దట్టమైన అడవులు, సెలయేళ్లతో ఈ ప్రాంతం అద్భుతంగా ఉండడమే. కార్తీకమాసం అంతా ఈ ప్రాంతానికి భక్తులతో పాటు పర్యాటకులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. అలాగే ఇప్పుడు శీతాకాలం అయినప్పటికీ పర్యాటకులు భారీగా విచ్చేస్తున్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణం..

ధారమఠం శివాలయ పరిసరాలు చక్కని వాతావరణంతో కంటికింపుగా ఉంటాయి. ఇక్కడి శివా లయం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఏదేళ్లుగా ఈ ప్రాంతం పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందింది. ధారకొండ దిగువన శివాలయం ఉంది. ఆలయానికి సమీపంలో జలజల పారే సెలయేరు పర్యాటకులను ఆకర్షిస్తూ ఉంటుంది. భక్తులు, పర్యాటకులు ఇక్కడే స్నానాలు ఆచరించి శివుడిని పూజిస్తారు.

చలికాలంలో మరింత రద్దీ..



ఆలయం వద్ద వాహనాల రద్దీ

అందమైన ప్రకృతి నడుమ ఉన్న ఇక్కడి శివాలయంలో కార్తీకమాసం నెలరోజులు ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఆలాగే మహా శివరాత్రి మూడు రోజులు వైభవంగా పూజలు చేస్తారు. అంతే కాకుండా చలికాలం ప్రారంభం నుండి జనవరి చివరి వరకు పర్యాటకులతో ఆలయంతో పాటు ఈ ప్రాంతం కూడా కిటకిటలాడుతుంది. సుదూర ప్రాంతాల నుండి భక్తులు, పర్యాటకులు ఎక్కువగా వస్తారు.

పర్యాటకంగా ఎంతో అభివృద్ధి



ధారమఠం భక్తులతో పాటు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. ఇక్కడికి ప్రతిరోజు వందలాది మంది భక్తులు, టూరిస్టులు వస్తుంటారు. దీంతో ఈ ప్రాంతం నిత్యం కిటకిటలాడుతుంటుంది. ఈ ప్రాంతాన్ని వీక్షించడం అపురూపమైన అనుభూతి అని చెప్పాలి.

– లెక్కల సత్యనారాయణ, పాతమల్లంపేట

నీటి సంఘాల ఎన్నికలు బహిష్కరిస్తున్నాం

– మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నర్సీపట్నం: అప్రజాస్వామికంగా జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికలను బహిష్కరిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. శనివారం జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరిస్తుందన్నారు. ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి దొడ్డిదారిలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి కూటమి నాయకులకు పదవులు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఓటమి భయంతోనే కూటమి ప్రభుత్వం అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని అడ్డదారులు తొక్కుతుందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన రైతన్నలు ఎన్నికల్లో పాల్గొనకుండా అధికారుల అండతో కుట్రలు పన్నుతోందని విమర్శించారు. అందుకే ఎన్నికలు బహిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను పరామర్శిస్తున్న బొడ్డేడ ప్రసాద్

గణేష్‌ను పరామర్శించిన బొడ్డేడ..

మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ శుక్రవారం ఆయనను పరామర్శించారు.

ఫారెస్టు పోడు భూములకు పట్టాలివ్వాలి

దేవరాపల్లి: ఫారెస్టు పోడు భూములకు పట్టాలివ్వాలని సీపీఎం మండల కార్యదర్శి బి.టి. దొర, స్థానిక గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వాలాబు రెవెన్యూ సదస్సులో స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు. గతంలో వాలాబు పంచాయతీలో కొందరికి ఫారెస్టు బంజరు భూములకు పట్టాలిచ్చారన్నారు. మిగిలిన వారికి సైతం పట్టాలు ఇవ్వాలని దరఖాస్తు చేస్తే తీసుకోకపోవడం అన్యాయమన్నారు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేస్తే అర్హులకు పట్టాలిస్తామని కలెక్టర్ చెప్పినా స్థానిక రెవెన్యూ అధికారులు దరఖాస్తులు తీసుకోవడం లేదని దొర ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి దరఖాస్తులు స్వీకరించి ఫారెస్టు బంజరు భూములకు పట్టాలిచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

తామరం పాఠశాలలో శుభదిన్ భోజన్

మాకవరపాలెం: తామరం-2 ప్రాథమిక పాఠశాలలో శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హెచ్‌ఎం పార్వతి విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్లు, భోజనం అందించారు. ఇందులో ఎంఈవో మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం పోషణ్ పథకంలో దాతలు ఎవరైనా విద్యార్థులకు ఆహారం అందించవచ్చన్నారు.

ఎస్‌డీజీపై రెండు రోజుల శిక్షణ

మాకవరపాలెం: సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ)పై రెండు రోజుల శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణకు పైన తెలిపిన వారంతా తప్పక హాజరు కావాలని అన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నర్సీపట్నం: నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి)లో పదవ తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు రూ.13,500 విలువ చేసే డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, పూర్వ విద్యార్థి అల్లాడ సురేష్ కుమార్ అందజేశారు. హెచ్‌ఎం కేవీ రమణ చేతుల మీదగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐఎస్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

దేవరాపల్లి: మండలంలోని ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఆశ్రయ్ ఫౌండేషన్ సభ్యులు స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత చేతుల మీదుగా శుక్రవారం పాఠశాల టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం స్వర్ణలత మాట్లాడుతూ ఆశ్రయ్ ఫౌండేషన్ సభ్యులు సమాజ సేవలో తరిస్తున్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని బాగా చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. ఆశ్రయ్ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం



వి.బి.పేట రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదరావు

కె.కోటపాడు : గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ వి.భాగ్యావతి, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్‌బాబు అన్నారు. చంద్రయ్యపేటలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ భాగ్యావతి, పైడంపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ రమేష్ బాబు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు సబ్బవరపు పార్వతి, రొంగలి రాఘవనాయుడు పాల్గొన్నారు.

వి.బి.పేటలో..

చీడికాడ: రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని వి.బి.పేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అయన పాల్గొన్నారు. ఈ మేరకు పలు భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి 16 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంటాకు నర్సింమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చింతలూరు, వీరనారాయణం గ్రామాల్లో..

మాడుగుల రూరల్: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని స్థానిక తహసీల్దార్ కె. రమాదేవి పేర్కొన్నారు. మండలంలో చింతలూరు, వీరనారాయణం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి సదస్సుల్లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో సమస్యలకు సంబంధించి రైతుల నుండి మూడు అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్ జగదీశ్, అయా గ్రామాల సర్పంచ్‌లు కాళింగ శకుంతల, యల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు దాడి నూకరత్నం, రైతులు పాల్గొన్నారు.



చింతలూరులో రెవెన్యూ సదస్సు దృశ్యం

పేర్ల తొలగింపుపై రైతుల ఆందోళన

నాతవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆన్‌లైన్‌లో ఉన్న సాగు హక్కును తొలగించారంటూ ఏపీ పురం రైతులు అందోళనకు దిగారు. పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ పైల రమేష్ నాయుడు అధ్యక్షతన తహసీల్దార్ వేణుగోపాల్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఏపీ పురం గ్రామ రెవెన్యూ పరిధిలో 280 ఎకరాలకు పైగా భూమిలో సుమారు 150 మందికి పైగా రైతులు 70 ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్నారు. నాటి నుండి రైతులు పేర్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ అధికారులు రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆన్‌లైన్ నుంచి తొలగించారు, రైతులు వద్ద రికార్డులతో గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. అయితే రైతులు చెబుతున్న విషయాన్ని తహసీల్దార్ వినకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు అందోళనకు దిగారు. గతంలో ఆన్‌లైన్‌లో సాగు హక్కు ఉన్న పత్రాలను చూపిస్తూ రెవెన్యూ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. మీరు వచ్చాకే మా పేర్లు ఆన్‌లైన్‌లో లేకుండా తారుమారు చేశారంటూ రైతులు ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకుని న్యాయం చేయాలని, లేకుంటే ధర్నా చేస్తామంటూ హెచ్చరించారు. దీనికి స్పందించిన తహసీల్దార్ రైతులు సాగు చేస్తున్న భూములు తాను స్వయంగా పరిశీలించి న్యాయం చేస్తానన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: రెవెన్యూ అధికారుల తప్పిదాల కారణంగా రైతుల భూమి ప్రభుత్వ భూమిగా నమోదు కావడం వల్ల పలువురు రైతులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ పైల రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ పారుపల్లి రాము, ఎంపీటీసీ సభ్యుడు లోకా లోవరాజు తహసీల్దార్ వేణుగోపాల్‌కు తెలిపారు. ఆ తప్పిదం వల్ల రైతులకు క్రయ విక్రయాలు జరగలేదని, బ్యాంకు రుణాలు లభించలేదని తెలిపారు. దీనివల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని వివరించి భూమిని చూపించారు. 2 సెంట్లు 22ఏలో నమోదు కావడం వల్లే ఇలా జరిగిందన్నారు. అప్పట్నుంచి 14 ఎకరాల 76 సెంట్ల విస్తీర్ణంలో సాగు చేసుకునే రైతులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రెవెన్యూ సదస్సుకు వచ్చిన తహసీల్దార్‌కు రైతులు వివరించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూమి గతంలో జిరాయితీ భూమిగా సాగు చేసుకునే రైతుల పేరిట ఉన్నట్లు పట్టాదారు పాసు పుస్తకాలలో ఉంది. దీంతో తహసీల్దార్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఈ భూమి జిరాయితీ భూమి అని, పొరపాటున సమస్య వచ్చిందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత రామచంద్రరావు, డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వో సబ్బవరపు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలి వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దేవరాపల్లి: అనకాపల్లిలో శుక్రవారం చేపట్టిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. అన్నదాతలను దగా చేసిన కూటమి సర్కార్‌పై నిరసన గళం వినిపించేందుకు మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు నేతృత్వంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్‌లు నాగిరెడ్డి శరినాయుడు, దాడి జగన్, టోకురి రామకృష్ణ, డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కె.వి.రమణ, కాటిపాం పెదనాయుడు తదితరులు తరలి వెళ్లారు.



నిరసన కార్యక్రమానికి తరలి వెళ్తున్న దేవరాపల్లి మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు

హెచ్‌ఎం, ఎంఈవోలకు నోటీసులు

రోలుగుంట: ఒక హెచ్‌ఎం విధులకు దుమ్మా కొట్టిన ఘటన ఎంఈవోల మెడకు చుట్టుకుంది. విధులకు దుమ్మా కొట్టిన హెచ్‌ఎం నాగభూషణంతో పాటు ఎంఈవో-1 జానుప్రసాద్, ఎంఈవో-2 పి.జగ్గారావుకి శుక్రవారం అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు నోటీసులు జారీ చేశారు. బుచ్చింపేట ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం యు.నాగభూషణం విధులకు దుమ్మా కొడుతూ, ప్రైవేటు వ్యక్తులతో అనధికారికంగా తన విధులు నిర్వర్తింపజేస్తున్న ఘటనపై పత్రికల్లో శుక్రవారం వెలువడిన వార్తలపై జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు స్పందించారు. శుక్రవారం యలమంచిలి డిప్యూటీ డీఈవోతో కలిసి బుచ్చింపేట పాఠశాలను సందర్శించారు. బాధ్యుడైన హెచ్‌ఎం నాగభూషణం, ఇదే పాఠశాలలో పని చేస్తున్న సహచర ఉపాధ్యాయులు డి.వి.సత్యనారాయణ, కె.కృష్ణారావు, ఆయా నాగలక్ష్మి, ఎంఈవో-1, ఎంఈవో-2ను విచారించారు. అనంతరం హెచ్‌ఎం యు.నాగభూషణంతో పాటు ఎంఈవో-1, ఎంఈవో-2కు నోటీసులు జారీ చేశారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడలోని సియోను ప్రార్థన మందిరంలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు దండే జాన్ విక్టర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు, సబ్బవరం నుండి హాజరైన రెవ. విజయ్‌కుమార్, పాస్టర్లు డేవిడ్ లివింగ్ స్టోన్, రవికుమార్, ఎం.శ్యామ్ బాబు, ఎస్. శ్యామూల్‌రాజ్, బి.జాన్ టైటస్ తదితర సంఘ కాపర్లు, సేవకుల సమక్షంలో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం పలు గ్రామాల నుండి వచ్చిన సేవకులకు దండే జాన్ విక్టర్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన చీరలను బూరె బాబురావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాము, గ్రామ పెద్దలు, సంఘ సేవకులు తదితరులు పాల్గొన్నారు.



బోయిలకింతాడ చర్చిలో సేవకులకు చీరలు అందజేస్తున్న బూరె బాబూరావు

ఎన్నిక గల్లంతుపై రైతుల ఆగ్రహం

బుచ్చెయ్యపేట: మండలంలో గుర్రపుగెడ్డ ఛానల్ ఎన్నికను అధికారులు గల్లంతు చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సాగునీటి సంఘం ఎన్నికల్లో గుర్రపుగెడ్డ ఛానల్ నోటిఫికేషన్‌ను ప్రకటించకపోవడంతో రైతులు ఖంగుతిన్నారు. లోపూడి, శింగవరం, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, పొట్టిదొరపాలెం గ్రామాల మధ్య ఉన్న గుర్రపుగెడ్డకు పూర్వ నుండి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. శనివానం జరిగే నీటి సంఘం ఎన్నికల్లో భాగంగా గుర్రపుగెడ్డకు ఎన్నిక నిర్వహించడానికి అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయకపోగా ఎన్నిక లేదని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తెలపడంతో పై గ్రామాల రైతులు ఆవేదన చెందారు. గుర్రపుగెడ్డ కింద సుమారు 650 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉండగా సుమారు 530 మందికి పైగా రైతులున్నారు. ఎన్నిక జరగకపోవడంతో అభివృద్ధి నిధులు మంజూరు కాక పంట పొలాలకు సక్రమంగా నీరందని పరిస్థితి ఏర్పడిందని రైతులు వి. సత్తిబాబు, బావిశెట్టి పెద సూరిబాబు, దొండా శ్రీనివాసరావు, బి నాగేశ్వరరావు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, చోడవరం ఇరిగేషన్ డీఈ వేణుగోపాలరావు, తహసీల్దార్ లక్ష్మికి సాగునీటి సంఘం రైతులు వినతిపత్రం అందించారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి ఎన్నిక నిర్వహించేలా చూస్తామని అధికారులు రైతులకు తెలిపారు.



లోపూడిలో ప్రవహిస్తున్న గుర్రపుగెడ్డ కాలువ

'సినిమా పిచ్చోడు' చిత్ర యూనిట్ సందడి

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఎన్నేటి కుమారస్వామి నటిస్తూ, దర్శకత్వం వహించిన 'సినిమా పిచ్చోడు' చిత్ర యూనిట్ శుక్రవారం దేవరాపల్లిలో సందడి చేసింది. స్థానిక మహేశ్వరీ థియేటర్‌లో ప్రదర్శించిన ఈ చిత్రాన్ని స్థానికులు, చిత్ర యూనిట్‌తో కలిసి కుమారస్వామి తిలకించారు. అనంతరం థియేటర్ ప్రాంగణంలో యూనిట్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సందడి చేశారు. అనంతరం స్థానికుడైన హీరో కుమారస్వామిని థియేటర్ యజమాని ఎల్లేటి కరుణాకర్‌రావు తదితరులు ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు సినీ పరిశ్రమలో రాణించడం గర్వకారణమని ప్రశంసించారు. నటుడు కుమారస్వామిని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, కిల్లి గోవింద, గొర్లి దేముళ్లు, దుక్క సత్తిబాబు, చిటికిరెడ్డి స్వామినాయుడు, గండేపల్లి సత్యనారాయణ, సత్తిరాజు, గవిరెడ్డి దేముడునాయుడు, బాబ్జి తదితరులు సత్కరించారు. స్వస్థలంలో తాను నటించిన సినిమా స్థానికులతో కలిసి తిలకించడం తన అదృష్టంగా భావిస్తున్నానని కుమార్‌స్వామి తెలిపారు.



నటుడు కుమారస్వామిని సత్కరిస్తున్న స్థానిక నాయకులు తదితరులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నర్సీపట్నం: నలంద ఇంగ్లీషు మీడియం స్కూల్ యాజమాన్యం శుక్రవారం మున్సిపల్ స్టేడియంలో ఘనంగా స్పోర్ట్స్‌డే నిర్వహించింది. ఈ వేడుకల్లో అసెంబ్లీ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం ఆయన క్రీడాజ్యోతిని వెలిగించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నేరెళ్ల రాజేష్, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

చోడవరం సుగర్స్ ఎండీకి సత్కారం

చోడవరం: చోడవరం సహకార చక్కెర కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్ పి.సన్యాసినాయుడును గురువారం అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నిర్వహించిన కిసాన్ మేళాలో సత్కరించారు. చక్కెర కర్మాగారం నిర్వహణ ద్వారా చెరకు రైతులకు అందిస్తున్న సేవలను గుర్తించి ఆచార్య ఎన్.జి.రంగా విశ్వ విద్యాలయం ఎండీ నాయుడుకు ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందచేసారు. విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ శివన్నారాయణ, పలు ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, పి.వి.జి. కుమార్, అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ తదితరులు పాల్గొన్నారు.



ఎండీ సన్యాసినాయుడును సత్కరిస్తున్న అతిథులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

చీడికాడ: ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పారదర్శకతతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో హేమసుందరరావు అన్నారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆర్‌జీఎస్ఏ కార్యచరణ ప్రణాళిక 2024-25 ఎల్ఎస్‌డీజీఎస్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాలు, మండలాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులతో కలిసి అంతా పని చెయ్యాలన్నారు. ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు